క్లుప్తంగా

అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



దాతను సత్కరిస్తున్న ఆలయ పర్యవేక్షకురాలు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలంలో అన్నప్రసాద వితరణ పథకానికి శనివారం గుంటూరుకు చెందిన మారంరెడ్డి భాస్కర్‌రెడ్డి రూ.1,00,116 విరాళాన్ని ఆలయ పర్యవేక్షకురాలు టి.హిమబిందుకు అందజేశారు. దాతకు దేవస్థానం తరుపున స్వామివారి శేషవస్త్రం, లడ్డూప్రసాదాలు, జ్ఞాపికను అందజేసి సత్కరించారు.

అలరించిన నృత్యప్రదర్శన



నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా శనివారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన లాస్యప్రియ నృత్యనికేతన్ కూచిపూడి డ్యాన్స్ బృందం చేసిన సంప్రదాయ నృత్య ప్రదర్శన భక్తులను అలరించింది. వినాయకకౌత్వం, నమశ్శివాయతే, నటరాజస్తోత్రం, అఖిలాండేశ్వరి, నటరాజస్తుతి, దేవిస్తుతి, భో శంభో తదితర గీతాలకు హరిప్రియ, వేదవల్లి, ఋషిక, గీతిక, సన్నిధి, శ్రీనిధి, నిహారిక, శృతస్య, లాక్షణ్య తదితరులు నృత్య ప్రదర్శన చేశారు.

గిరిజన ఆశ్రమ పాఠశాల తనిఖీ



తాగునీటి ట్యాంకును పరిశీలిస్తున్న కాంతారావు నాయక్

మహానంది: గిరిజన ఆశ్రమ పాఠశాలలో ఆహార పదార్థాలు వండే విషయంలో శుభ్రత పాటించాలని ఆర్‌బీఎస్‌కే డాక్టర్ కాంతారావు నాయక్ తెలిపారు. శనివారం పాఠశాలను తనిఖీ చేశారు. వంటశాల, మంచినీటి ట్యాంకులను పరిశీలించారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వంటగది, వంటపాత్రలను శుభ్రంగా ఉంచాలని సూచించారు. ఆయనతో పాటు ఎంపీహెచ్ఈఓ హుసేన్‌రెడ్డి, ఏఎన్ఎం భార్గవి, ఆశా కార్యకర్తలు ఉన్నారు.

వర్షాలతో మొక్కజొన్నలో కత్తెర పురుగు



మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

మహానంది: అధికంగా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొక్కజొన్న సాగు చేసే రైతులు జాగ్రత్తలు తీసుకోవాలని వ్యవసాయాధికారి నాగేశ్వరరెడ్డి సూచించారు. మసీదుపురం గ్రామ పరిసరాల్లో శనివారం మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఏఓ నాగేశ్వరరెడ్డి మాట్లాడుతూ.. పంటలో కత్తెరపురుగు ఉండటం గుర్తించామన్నారు. దీని నివారణకు ఇమిడా క్లోప్రిడ్ మందును ఐదు మిల్లీలీటర్లు కిలో విత్తనానికి కలిపి విత్తనశుద్ధి చేసుకోవాలన్నారు. పురుగు గుడ్ల నివారణకు వేపనూనెను ఎకరాకు లీటర్ చొప్పున పిచికారీ చేసుకోవాలని తెలిపారు.

పౌష్టికాహారంతో ఆరోగ్యం



ఆడపిల్లల తల్లులకు అవగాహన కల్పిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగేశ్వరమ్మ

కొత్తపల్లి: బాలికలు రక్తహీనతకు గురికాకుండా మంచి పౌష్టికాహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ నాగేశ్వరమ్మ సూచించారు. శనివారం మండల పరిధిలోని సింగరాజు పల్లె అంగన్వాడీ కేంద్రంలో బాలసభ కార్యక్రమం నిర్వహించారు. బాలికల ఆరోగ్యం విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై తల్లులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు హరిత, అంకమ్మ, రమాదేవి, లక్ష్మీదేవి, పాల్గొన్నారు.

కారకులను కఠినంగా శిక్షించాలి

జూపాడుబంగ్లా: ఇస్కాల గ్రామానికి చెందిన చాకలి ఎర్రన్న అలియాస్ రంగస్వామి హత్యకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని రజక సంక్షేమ సంఘం మాజీ రాష్ట్ర సభ్యుడు బస్తిపాటి మౌలాలి, మండల అధ్యక్షుడు ఆంజనేయులు, ఉపాధ్యక్షుడు నాగభూషణం డిమాండ్ చేశారు. శనివారం జూపాడుబంగ్లాలో విలేకరులతో మాట్లాడుతూ రజకులపై నానాటికి దాడులు పెరిగిపోతున్నాయని.. ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని ఆందోళన వ్యక్తం చేశారు. వారం క్రితం ఆళ్లగడ్డలో చాకలి శ్రీనుపై పాశవికంగా దాడిచేశారన్నారు. తాజాగా పాములపాడు మండలం ఇస్కాల గ్రామానికి చెందిన చాకలి ఎర్రన్నను దారుణంగా హత్యచేశారన్నారు. టీడీపీ గెలుపు కోసం కష్టపడిన రజకులపైనే దాడులు, హత్యలు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు.

లోక క్షేమంకరీ.. శాకంబరి

- అషాడ పౌర్ణమిని పురస్కరించుకుని నేడు శాకంబరీ ఉత్సవం
- వివిధ రకాల కూరగాయలతో అమ్మవారి అలంకరణ
- లోకకల్యాణం కోసం విశేష పూజలు



వివిధ రకాల కూరగాయలతో అమ్మవారి అలంకరణ



కూరగాయలతో శోభిల్లుతున్న ఆలయ ప్రాంగణం

శ్రీశైలంటెంపుల్: ఆదిపరాశక్తి ఎన్నో రూపాలను ధరించింది. మరెన్నో వరాలను కురిపించింది. అన్నీ లీలల్లో ఉండే అంతరార్థం ఒక్కటే. అదే అమెలోని అమ్మతనం. తన అమ్మతనంలో ఆ పరాశక్తి ధరించిన అవతారాల్లో శాకంబరీ స్వరూపం ఒకటి. అమ్మవారి లీలా రూపాల్లో శాకంబరీ స్వరూపం ఎంతో ప్రసిద్ధం. మాతృత్వానికి ప్రతీకగా చెప్పదగిన ఈ రూపవిశేషాన్ని దేవిభాగవతం వివరించింది.

అకలి తీర్చిన శాకంబరీ

పూర్వం హిరణ్యాక్షుని వంశానికి చెందిన దుర్గముడు అనే రాక్షసుడు తన తపశక్తితో వేదాలను అంతర్ధానం చేశాడు. దాంతో యజ్ఞయాగాదులు నిలిచిపోయాయి. ఈ కారణంగా కరువు కాటకాలతో తీవ్రమైన క్షామం ఏర్పడింది. అప్పుడు మహర్షులందరూ పరాశక్తి గురించి తపస్సు చేశారు. ఆ తపస్సుకు పరాశక్తి ప్రసన్నురాలై లోకరక్షణ కోసం దుర్గముడిని సంహరించి, వేదాలను రక్షించి, వైదికకర్మలను పునరుద్ధరించింది. ఆ సందర్భంలోనే జగన్మాత తన నుంచి వివిధ రకాల ఆకుకూరలు, కూరగాయలు, ఫలాలను సృష్టించి జీవుల ఆకలి తీర్చింది. ఈ విధంగా అవతరించిన పరాశక్తి స్వరూపమే శాంకబరీదేవి. ఈ కారణంగానే అషాడ పౌర్ణమి రోజున అమ్మవారిని శాకాలతో అలంకరించే సంప్రదాయం ఏర్పడింది.

ఉత్సవానికి ఏర్పాట్లు

శ్రీశైల మహాక్షేత్రంలో జరిగే వార్షిక ఉత్సవాల్లో శాకంబరీ ఉత్సవం ఒకటి. ఏటా అషాడ పౌర్ణమి రోజున ఎంతో వైభవంగా ఈ ఉత్సవం నిర్వహిస్తారు. ఆదివారం జరిగే ఈ ఉత్సవానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేసింది. అమ్మవారి మూలమూర్తిని పలు రకాల ఆకుకూరలు, కూరగాయాలు, ఫలాలతో సుందరంగా అలంకరించారు. ఇందు కోసం 2 వేల కేజీలకుపైగా ఆకుకూరలు, కూరగాయలు, ఫలాలను తెప్పించారు. వంగ, బెండ, దొండ, కాకర, చిక్కుడు, గోరుచిక్కుడు, మునగ, పొర, బీర, గుమ్మడి, బంగాళదుంప, కందదుంప, క్యాప్సికమ్, క్యాబేజీ, బీన్స్, క్యారెట్, అరటి వంటి కూరగాయలు, తోటకూర, పాలకూర, మెంతికూర, చుక్కకూర మొదలైన ఆకుకూరలు, కమల, బత్తాయి, ద్రాక్ష, ఆపిల్, పైనాపిల్ మొదలైన ఫలాలు, నిమ్మకాయలు, బాదంకాయలు మొదలైన వాటిని ఈ ఉత్సవానికి తెప్పించారు. వేకువజాము నుంచే అమ్మవారిక విశేష పూజలు నిర్వహించనున్నారు. అమ్మవారిని దర్శించుకోవడం వల్ల దారిద్ర్యం తొలగి సిరిసంపదలు కలుగుతాయని భక్తుల విశ్వాసం.

శాకంబరీ ఉత్సవానికి ఏర్పాట్లు



కూరగాయల దండలను సిద్ధం చేస్తున్న సిబ్బంది

మహానంది: అషాడమాసం పౌర్ణమిని పురస్కరించుకుని ఆదివారం మహానందిలో శాకంబరీ ఉత్సవం నిర్వహిస్తున్నట్లు వేదపండితుడు చెండూరి రవిశంకర అవధాని తెలిపారు. ఈ సందర్భంగా శనివారం బాలాజీ సేవాసమితికి చెందిన సుమారు 50 మంది మహిళలు కూరగాయలతో దండలను సిద్ధం చేశారు. ఆషాడ మాసంలో శాకంబరీ ఉత్సవం చేయడం, శాకంబరీ అలంకారంలో ఉన్న కామేశ్వరీదేవిని దర్శించుకోవడం ఎంతో పుణ్యఫలం అని తెలిపారు.

ఎవరో తెలిసింది..!

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు మండలం నల్లకాల్వ గ్రామంలో శుక్రవారం అమాయకంగా తచ్చాడుతున్న మతిస్థిమితం లేని యువకుడు శనివారం ఇంటికి చేరుకున్నాడు. వెలుగోడులోని గుర్రంపేటకు చెందిన ఈ యువకుడి పేరు అరవిందాచారి అని తెలిసింది. నల్లకాల్వలో యువకుడు ఉన్నాడని తెలుసుకున్న తల్లిదండ్రులు అతన్ని ఇంటికి తీసుకెళ్లారు.

విధుల్లో నిర్లక్ష్యం వద్దు

- నంద్యాల జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ వెంకటరమణ



లింగాపురం హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో రికార్డులు పరిశీలిస్తున్న వెంకటరమణ

మహానంది: వైద్య, ఆరోగ్య సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంగా ఉంటే చర్యలు తప్పవని నంద్యాల జిల్లా డీఎంఅండ్‌హెచ్ఓ డాక్టర్ వెంకటరమణ హెచ్చరించారు. బండిఆత్మకూరు మండలం లింగాపురంలోని హెల్త్ వెల్నెస్ సెంటర్‌లో శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రస్తుతం నిర్వహిస్తున్న కుష్టువ్యాధి నివారణ గుర్తింపు సర్వేను నిర్ణీత వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్ఎంల ఫీల్డ్ రికార్డులు ఆశ కార్యకర్తల రికార్డులు తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. రోజుకు 20 నుంచి 25 గృహాలను సర్వే చేయాలని ఆదేశించారు. ఎంఎల్‌హెచ్‌పీ శృతి, ఏఎన్ఎం వనజ, ఆశ కార్యకర్తలు అంకమ్మ, శివగంగ, సుమలత పాల్గొన్నారు.

వేల్పనూరు పీహెచ్‌సీలో తనిఖీ

వెలుగోడు: వేల్పనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్యాధికారి వెంకటరమణ తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో సిజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. అబ్దుల్లాపురంలో జరుగుతున్న ఎఫ్‌డీఎఫ్ ప్రోగ్రామ్‌ను తనిఖీ చేశారు. వైద్యులు జహీర్ వలి, ప్రణీత్ ఉన్నారు.

మండల అభివృద్ధికి సహకరించాలి

- సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

పాములపాడు: మండలాభివృద్ధికి ప్రతి అధికారి సహాయ సహకారాలు అందించాలని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య కోరారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రుద్రవరం గ్రామంలో నేషనల్‌హైవే నిర్మాణ పనుల్లో కోల్పోయిన ప్రాథమిక పాఠశాలకు మరో చోట స్థలం సేకరించి కొత్తగా పాఠశాల భవనం నిర్మాణం చేపడతామన్నారు. ఆత్మకూరు నుంచి వేంపెంట గ్రామం మీదుగా నంద్యాలకు బస్సు సర్వీసు నడపాలని సర్పంచు మాణిక్యమ్మ ఎమ్మెల్యేను కోరారు.

- పాములపాడు మండల కేంద్రంలో బస్ షెల్టర్ నిర్మించాలని, బీసీ, ఎస్సీ కాలనీల్లో సీసీ రోడ్డు వేయాలని సర్పంచు మేకల భాగ్యమ్మ కోరారు.యర్రగూడూరు గ్రామంలో ఎస్సీ కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణం చేపట్టాలని ఎంపీటీసీ సభ్యురాలు దర్గమ్మబాయి విన్నవించారు. ఇస్కాల గ్రామానికి భవనాశి వాగు పై వంతెన నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ ఎమ్మెల్యేను కోరారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ సరస్వతి, డిప్యూటీ తహసీల్దార్ పఠాన్‌బాబు, ఎంఈఓ బాలాజీనాయక్, వైద్యులు నాగలక్ష్మి, సావిత్రి, భాస్కర్, అనిల్, ఏఓ ఫణీశ్వరరెడ్డి, జేఈ రాఘవేంద్రప్రసాద్, ఏఈలు అనిల్, శ్రీనివాసనాయక్, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

నాటిన మొక్కలను సంరక్షించలేదు

- రూ.25.56 లక్షలు వృథా
- సామాజిక తనిఖీలో వెల్లడి



భాస్కరాపురంలో జరిగిన ఉపాధిపనులపై గ్రామస్తులను విచారిస్తున్న పీడీ రామచంద్రారెడ్డి

జూపాడుబంగ్లా: మండలంలోని 12 గ్రామ పంచాయతీల్లో రూ.25,56,365 నిధులు వెచ్చించి నాటించిన మొక్కలు సంరక్షణ లేక చనిపోయినట్లు సోషల్ ఆడిట్ బృందం సభ్యులు తేల్చారు. శనివారం ఎన్ఆర్ఈజీఎస్ కార్యాలయం వద్ద పీడీ రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోషల్ ఆడిట్‌పై బహిరంగ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సోషల్ ఆడిట్ బృందం పదిరోజులపాటు గ్రామాల్లో పర్యటించి క్షేత్రస్థాయిలో వారు పరిశీలించిన వివరాలను అధికారులు, ప్రజల సమక్షంలో చదివి వినిపించారు. ప్రతి గ్రామ పంచాయతీలో ఉపాధిహామీ పథకం కింద రైతుల పొలాల్లో నాటిన మొక్కలు చనిపోయినట్లు తెలిపారు. తద్వారా మండలం వ్యాప్తంగా రూ.25,56,365 నిధుల నష్టం వాటిల్లినట్లు తెలిపారు. అలాగే గ్రామాల్లో చేసిన ఉపాధి పనుల వద్ద నేమ్‌బోర్డులు ఏర్పాటు చేయలేదని, ఉపాధి పనులపై టీఏ, ఏపీఓ, ఏపీడీల పర్యవేక్షణ కొరవడిందని వెల్లడించారు. 80బన్నూరు గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ శ్యాంబాబు జాబు కార్డులు ఇవ్వటానికి ఒక్కొక్కరి వద్ద రూ.500 తీసుకున్నాడని ఉపాధి కూలీలు పీడీ దృష్టికి తీసుకెళ్లారు. కొంత మంది పనులకు రాకున్నా వారిపేరున మస్టర్లు వేసి బిల్లులు స్వాహా చేసినట్లు ఫిర్యాదు చేశారు. పలు అక్రమాలకు పాల్పడుతున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌ను వెంటనే తొలగించాలని ఆ గ్రామానికి చెందిన చెంచు పుల్లన్న, ఇనాయత్‌ఖాన్ పీడీని కోరారు. అంబుడ్స్‌మెన్‌తో త్వరలో విచారణ చేయించి, ఆరోపణలు నిజమైతే విధుల్లోంచి తొలగిస్తామని పీడీ ఈ సందర్భంగా 80 బన్నూరు గ్రామస్తులకు హామీ ఇచ్చారు.

తూతూమంత్రంగా సామాజిక తనిఖీ

మండలంలోని 12 గ్రామపంచాయతీల్లో 2023 ఏప్రిల్ 01 నుంచి 2024 మార్చి 31 వరకు రూ.7,80,66,135 నిధులతో 808 పనులు చేపట్టారు. ఇందులో కూలీలకోసం రూ.5,63,81,082 వెచ్చించగా మెటీరియల్ కోసం రూ.2,16,85,050 ఖర్చు చేశారు. ఈ నిధుల వినియోగంపై సోషల్ ఆడిట్ నిర్వహించారు. రూ.7.80కోట్లతో చేపట్టిన ఉపాధి పనుల్లో చివరికి రూ.73,303 మాత్రమే అవినీతి, అక్రమాలు చోటుచేసుకున్నాయని బృందం సభ్యులు తెలిపారు. అందులో రూ.69,303 రికవరీకి ఆదేశించగా రూ.4,000 ఫెనాల్టీగా విధించారు. సామాజిక తనిఖీ చేసేందుకు 11 రోజులకు రూ.1,20,000 నిధులు ఖర్చు అయ్యాయి. కనీసం ఆడిట్ బృందం చేసిన ఖర్చంత కూడా రికవరీ చేయకపోతే ఇక సామాజికి తనిఖీ చేపట్టడం ఎందుకని గ్రామాల్లోని ఉపాధికూలీలు ప్రశ్నిస్తున్నారు. కాగా తాటిపాడు ఫీల్డ్ అసిస్టెంటు లింగన్నను ఎందుకు తొలగించటం లేదని సర్పంచ్ వంగల లక్ష్మిదేవి పీడీ రామచంద్రారెడ్డిని అడగగా ఈ విషయం హైకోర్టు పరిధిలో ఉందని తెలిపారు. కోర్టు ఉత్తర్వులు వచ్చే వరకు వేచి ఉండాల్సిందేనన్నారు.

కాచి వడబోసిన నీటినే తాగాలి



చెంచులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్న వైద్యాధికారి

ఆత్మకూరు: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ప్రజలు కాచి వడబోసి చల్లార్చిన నీటినే తాగాలని వైద్యాధికారి పవన్‌కుమార్ సూచించారు. శనివారం బైర్లూటి పరిధిలోని రుద్రకోడు చెంచుగూడెంలో సంచార వైద్యసేవల కార్యక్రమాన్ని నిర్వహించారు. సీజనల్ వ్యాధుల నివారణకు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రాత్రి వేళల్లో దోమతెరలను వాడాలని సూచించారు. జాగ్రత్తలు పాటిస్తే మలేరియా, డెంగీ, డయేరియా వంటి వ్యాధుల బారిన పడకుండా రక్షించుకోవచ్చన్నారు. తాగునీరు, తినే ఆహారం కలుషితమైనప్పుడు వాంతులు, విరేచనాలు సంభవించే ప్రమాదం ఉందన్నారు. అలాంటప్పుడు ఇంట్లోనే ఓఆర్ఎస్ ద్రావణాన్ని తయారు చేసుకుని ప్రమాదం నుంచి బయటపడాలని సూచించారు. అనంతరం చెంచులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

నేడు గురుపౌర్ణమి

శ్రీశైలంప్రాజెక్ట్: శ్రీశైలం ప్రాజెక్ట్‌లోని సాయిబాబా దేవాలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. బాబాకు అభిషేకాలు, అర్చనలు, ప్రత్యేక అలంకరణ, కాగడ హారతి, భక్తులకు అన్నదానం తదితర కార్యక్రమాలు చేయనున్నట్లు చెప్పారు.

ఆత్మకూరు: పట్టణంలో గురుపౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు సాయిబాబా దేవస్థాన ట్రస్ట్‌బోర్డు సభ్యులు తెలిపారు. స్వామివారికి ఉదయం ప్రత్యేక హారతులతో పాటు అలంకరణ, పల్లకీసేవ, రథోత్సవం, మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేయనున్నట్లు చెప్పారు. భక్తులకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశామన్నారు.

విద్యుత్ తీగలతో జాగ్రత్త

మహానంది: వర్షాకాలంలో విద్యుత్ తీగలు, స్తంభాల వద్ద ప్రజలు, రైతులు జాగ్రత్తగా ఉండాలని మహానంది, బండిఆత్మకూరు విద్యుత్ శాఖ ఏఈలు ప్రభాకర్ రెడ్డి, కంబగిరి సూచించారు. ఈ మేరకు పలు గ్రామాల్లో రైతులు, ప్రజలతో సమావేశం నిర్వహించారు. తడిచిన కరెంటు స్తంభాలను ముట్టుకోరాదని, విద్యుత్ లైన్లకు చెట్టుకొమ్మలు తగిలిన ఘటనలపై విద్యుత్ సిబ్బందికి సమాచారం అందించాలన్నారు. సర్వీస్ వైర్లు, ఇంటికొచ్చే వైర్లలో డ్యామేజీ ఉంటే వెంటనే విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

విద్యుత్ తీగల చోరీలను అరికట్టాలి

పగిద్యాల: మండలంలోని ముచ్చుమర్రి, పగిద్యాల, నెహ్రూనగర్, పడమర ప్రాతకోట, లక్ష్మాపురం తదితర గ్రామాల్లోని వ్యవసాయ బోర్ల వద్ద విద్యుత్ తీగలను మాయం చేస్తున్నారని రైతులు పెద్ద వెంకటరాముడు, తలారి అచ్చన్న, మారుగుత్తి చిన్నస్వాములు, బెస్త శ్రీనివాసులు, బెస్త రమణయ్య, తలారి శివన్న, మురళయ్య, రాంబాబు వాపోయారు. విద్యుత్ మోటార్లకు మళ్లీ వైర్ అమర్చేందుకు ఒక్కొక్క రైతుకు సుమారు రూ. 5 వేలు ఖర్చవుతుందన్నారు. తమ ప్రాంతంలో పదే పదే దొంగలు మోటర్ తీగలు తీసుకెళ్తున్నారని, పోలీసులు దృష్టి సారించి వారిని పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టపోకుండా జాగ్రత్తలు తీసుకోండి

కొత్తపల్లి: ప్రస్తుతం ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పంట నష్టపోకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మహేష్ రైతులకు సూచించారు. మొక్కజొన్న పంటలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలన్నారు. పొలాలు ఆరిన తర్వాత ఎకరానికి యూరియా 25 కేజీలు, పొటాష్ 25 కేజీలు వేయాలని శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

స్టార్టర్ల చోరీ



విద్యుత్ మోటార్ వద్ద చోరీకి గురైన స్టార్టర్ బాక్స్

కొత్తపల్లి: మండల పరిధిలోని ఎదురుపాడు గ్రామ సమీప పొలాల్లో విద్యుత్ మోటార్ల వద్ద ఉన్న స్టార్టర్లను గుర్తు తెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లారు. గ్రామానికి చెందిన కుమ్మరి హుస్సేనయ్య, ఈడిగ వెంకటరమణ గౌడ్ ఏలూరుపాడు గ్రామం నుంచి కొక్కెరంచ గ్రామానికి వెళ్లే దారిలో మొక్కజొన్న పంట సాగు చేసుకుంటున్నారు. వారి పొలంలోని విద్యుత్ మోటార్ల వద్ద ఉన్న స్టార్టర్లను శనివారం చోరీ చేశారు. గతంలో కూడా వ్యవసాయ బావుల వద్ద ఉన్న 3 విద్యుత్ మోటార్లు, 10 స్టాటర్ బాక్స్‌లు, మోటార్ కాపర్ వైర్లు చోరీకి గురయ్యాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దొంగతనాలపై పోలీసులు, అధికారులు దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం



రక్తదానం చేసిన వారిని అభినందిస్తున్న వైద్యాధికారి రాయుడు

ఆత్మకూరు: రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని వైద్యాధికారి రాయుడు పిలుపునిచ్చారు. శనివారం ఆర్టీసీ డిపో మేనేజర్ మహేంద్రుడు ఆధ్వర్యంలో ఏపీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నంద్యాల ప్రభుత్వ ఆస్పత్రి జిల్లా రక్తనిధి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. వైద్యాధికారి రాయుడు మాట్లాడుతూ.. రక్తదానం చేసిన 90 రోజుల్లో మళ్లీ రక్తం సాధారణ స్థాయికి వస్తుందన్నారు. 60 ఏళ్లలోపు వారు రక్తదానం చేయవచ్చని తెలిపారు. ప్రమాదాల బారినపడిన వారికి, రక్తహీనతతో బాధపడే గిరిజన గ్రామీణ గర్భిణులకు సేకరించిన రక్తాన్ని ఉపయోగిస్తారన్నారు. ప్రతి ఒక్కరూ రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని కోరారు. డ్రైవర్లు, గ్యారేజ్ సిబ్బంది రక్తదానం చేశారు.

దంచికొట్టిన వాన

- మహానందిలో 45.8మి.మీ
- బండిఆత్మకూరులో 43.6మి.మీ నమోదు
- జూపాడుబంగ్లాలో 18.4 మి.మీ



తమ్మడపల్లె వద్ద పొలంలో నిలిచిన వర్షపునీరు



ఆత్మకూరులో కురుస్తున్న వర్షం



ఈర్నపాడు వద్ద రోడ్డుపై నిలిచిన నీరు

మహానంది: మహానంది, బండిఆత్మకూరు మండలాల్లో రెండు రోజుల నుంచి కుండపోత వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం నుంచి ప్రారంభమైన వర్షం శనివారం ఉదయం వరకు దంచికొట్టింది. మహానంది మండలంలో 45.8 మి.మీ, బండిఆత్మకూరు మండలంలో 43.6 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణశాఖ అధికారులు తెలిపారు. వివిధ రకాల పంటలను సాగు చేసేందుకు సిద్ధంగా ఉన్న రైతులు ఇది మంచి వర్షమని ఊరటచెందారు. ఇదిలా ఉండగా రైతులు వర్షపునీటిని పంటపొలాల్లో నిల్వ ఉంచుకుండా ఎప్పటికప్పుడు బయటకు వెళ్లేలా చూసుకోవాలని ఏఓ నాగేశ్వరరెడ్డి సూచించారు. బండిఆత్మకూరు మండలం ఓంకారం రోడ్డు, ఈర్నపాడు రోడ్లపై భారీ గుంతలు ఉండడంతో వర్షపునీరు చేరి కుంటలను తలపిస్తున్నాయి. అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు చేపట్టాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఆత్మకూరులో 20.4 మి.మీ. వర్షపాతం

ఆత్మకూరు: మండలంలో శనివారం 20.4 మి.మీ. వర్షపాతం నమోదైందని అధికారులు తెలిపారు. రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఈనెల 8వ తేదీ 2.8 మి.మీ., 9వ తేదీన 85.8 మి.మీ., 10న 9.8 మి.మీ., 11న 14.6 మి.మీ., 13వ తేదీ 12.4 మి.మీ., 16వ తేదీ 49.6 మి.మీ చొప్పున వర్షం కురిసింది. మండలంలో జూలై నెలలో సాధారణ వర్షపాతం 167.0 మి.మీ కాగా ఇప్పటికే 200 మి.మీ వర్షపాతం నమోదైంది. పలు చోట్ల రైతులు సాగుచేసిన మొక్కజొన్న, కంది పంటలు దెబ్బతిన్నాయి. మండలంలో 1250 ఎకరాల్లో కంది, మొక్కజొన్న పంట దెబ్బతిన్నాయి. జరిగిన నష్టంపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిస్తామని మండల వ్యవసాయాధికారి విష్ణువర్ధన్‌రెడ్డి తెలిపారు. ఇలానే వర్షాలు కురిస్తే పూర్తిస్థాయిలో పంటలు దెబ్బతినే అవకాశం ఉందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. బవనాసి, సుద్దవాగు, గుండ్లకమ్మ వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి.

జూపాడుబంగ్లా: మండలంలోని వివిధ గ్రామాల్లో శుక్రవారం సాయంత్రం నుంచి శనివారం ఉదయం వరకు 18.4 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. నందికొట్కూరు నియోజకవర్గంలో నందికొట్కూరులో అత్యధికంగా 32.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదు కాగా, పగిడ్యాల మండలంలో 24.8, పాములపాడులో 23.4, కొత్తపల్లిలో 20.2, మిడ్తూరులో 19.6 మిల్లీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైనట్లు ఏఎస్ఓ హనుమంతు తెలిపారు. గత ఐదు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలు ఖరీఫ్‌లో సాగుచేసిన మొక్కజొన్న, కంది, మినుము, పత్తి పంటలకు మేలు చేశాయని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ముట్టడి

- సమస్య పరిష్కారంలో నిర్లక్ష్యంపై ఆగ్రహం



నిరసన తెలుపుతున్న సీపీఐ నాయకులు

మహానంది: అబ్బీపురం గ్రామంలోని గిరిజనకాలనీలో వర్షపునీరు నిలిచి తీవ్ర అవస్థలు పడుతుంటే ఎన్నిసార్లు చెప్పినా అధికారులు స్పందించకపోవడం దారుణమని సీపీఐ జిల్లా కార్యదర్శి రంగనాయుడు, సహాయ కార్యదర్శి బాబాఫక్రుద్దీన్ అన్నారు. శనివారం ఎంపీడీఓ కార్యాలయాన్ని ముట్టడించి నిరసన తెలిపారు. వర్షపునీరు నిలిచి అవస్థలు పడుతుంటే పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పందించిన ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి వెంటనే ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, సర్పంచ్ శవ్వా శ్రీలక్ష్మీతో మాట్లాడారు. గ్రావెల్ వేసేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో నిరసన విరమించారు. ఏఐవైఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాముడు, సీపీఐ నాయకులు సామేలు, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

వైభవంగా మౌలాలిస్వామి జార్తలు



భక్తజనం మధ్య మౌలాలిస్వామి ఊరేగింపు

మహానంది: గాజులపల్లెలో మహిమాన్వితుడిగా మౌలాలిస్వామి ఎంతో ప్రసిద్ధి. స్వామికి మొహర్రం అనంతరం జార్తలు నిర్వహించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి నుంచి శనివారం మధ్యాహ్నం వరకు స్వామివారి పీరును గ్రామంలో ఊరేగించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాతో పాటు ప్రకాశం, గుంటూరు జిల్లాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని బాసికాలు, వెండి గొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా మహానంది, బండిఆత్మకూరు ఎస్ఐలు నాగేంద్ర ప్రసాద్, మల్లికార్జున, పోలీసు సిబ్బంది బందోబస్తు నిర్వహించారు.